# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 142 | విశాఖపట్నం | 22-2-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 142 | VISAKHAPATNAM | 22-2-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



**రిపోర్టర్లు కావలెను**

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


# డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ అరాచకాలు

## విశాఖ డ్రగ్ కంట్రోల్‌లో వివాదంగా మారిన అవినీతి అధికారి వ్యవహారం..



**మూడు వారాలు గడిచిన విశాఖలో పై అధికారులకు తాళాలు ఇవ్వని అధికారి**

**పై అధికారులు అండదండలు ఉండటంతో చోద్యం చూస్తున్న ఔషధ నియంత్రణ శాఖ**

**ఇంత జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం వెనక మర్మం ఏమిటో**

**విశాఖ నుండి మూడు వారాల క్రితం అటాచ్ చేసినా.. ఇంకా బోర్డులు తీయని అవినీతి అధికారి**




విశాఖపట్నంలో గల అవినీతి అధికారి ఎస్.విజయకుమార్ నేమ్ బోర్డు

(అమరావతి, పతాకం న్యూస్)

**డగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ ను అధికారికంగా డైరెక్టర్ జనరల్ కి జత చేశారా లేదా కేవలం హెడ్ క్వార్టర్స్ కి మాత్రమే జత చేసారా.... అసలు డైరెక్టర్ జనరల్ కింద ఏడీ పోస్ట్ ఉందా!!! లేకపోతే వైజాగ్ ఔషధ నియంత్ర శాఖలో బోర్డు, అమరావతిలో బోర్డు ఏంటి ..**







విజయవాడలో గల అవినీతి అధికారి ఎస్.విజయకుమార్ నేమ్ బోర్డు

అవినీతి కేసులో, ఏసీబీ వలలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడి ఉన్నా అధికారి, విశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ గా అవినీతి అక్రమాలు ఆరోపణల వలన పనిష్మెంట్ లో ఉన్న అధికారి అలా అసంబద్ధంగా డైరెక్టర్ జనరల్‌కు జత చేయబడినట్టు పేర్కొంటూ నేమ్ బోర్డు పబ్లిక్ గా ప్రదర్శించటం డిపార్ట్‌మెంటును మరియు ప్రభుత్వాన్ని రాజకీయ కోణంలో చెడుగా చూపటం కాదా!! మరియు అది ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఉల్లంఘన కాదా!!

విశాఖ నుండి అధికారికంగా ట్రాన్స్‌ఫర్ చేసి మూడు వారాలు పైగా గడిచిన ఇంకా పూర్తిగా రిలీవ్ చేసి, బాధ్యతలు రికార్డులు మరియు ఇతర ప్రభుత్వ ఆస్తులను సంబంధిత అధికారికి అప్పగించకపోవడం దేనికి సంకేతం.. దీని వెనుక ఎవరి పెద్దల హస్తం ముందో ప్రభుత్వ పెద్దలు ఎవరో ఉన్నారో మరి..!

ట్రాన్స్‌ఫర్ అయిన తర్వాత విశాఖపట్నం కార్యాలయంలో గది మరియు రికార్డులను తన అధీనంలో ఉంచుకోవటం విశాఖ జిల్లా ప్రజలకు మరియు కెమిస్టు ఇతరులకు ఇంకా తానే అసిస్టెంట్ డైరెక్టర్ చెప్పుకోవటం డిపార్ట్‌మెంటు నియమాలు ప్రకారం ఉల్లంఘన కాదా!! ఆఫీస్ తాళాలు మరియు ఆఫీస్ తన ఆధీనంలో పెట్టుకోవడంపై అధికారులు లోపాయకారి ఒప్పందం ప్రకారం జరుగుతున్నట్టు ఉన్నట్టు ఉంది కదా!!

విశాఖ డ్రగ్ ఆఫీసు సీసీటీవీ దృశ్యాలను వ్యక్తిగత పరికరాల ద్వారా చూడటానికి లేదా పర్యవేక్షించడానికి ఆయనకి అధికారి అనుమతి ఏమైనా ఉందా? ఇంత జరుగుతున్న విశాఖ డిడి చోద్యం చూడ్డం వెనక ఏమిటో మతలబు చెప్పాలి! ఈ అంశాలన్నీ చూసుకుంటే నియమాలు ఉల్లంఘన మరియు అనధికారకం అని తేలితే,విచారణ చేసే ప్రతిపాదన ఉంది కదా, ఎందుకు చేయట్లేదు వెంటనే చేసి డిస్మిస్ చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది కదా.. అది ఎప్పుడు చేస్తారో మరి వేచి చూద్దాం!

ఉన్నతాధికారులు, మరియు హెల్త్ మినిస్టర్, హెల్త్ సెక్రటరీ వెంటనే పట్టించుకోని వెంటనే ఆ బోర్డులు పెట్టిన అసిస్టెంట్ డైరెక్టర్ పై చర్యలు తీసుకోవాలని పౌర సంఘాలు,ప్రజా సంఘాలు విద్యార్థుల నాయకులు గగ్గోలు పెడుతున్న సందర్భాలు ఉన్నాయి వెంటనే ప్రభుత్వం స్పందించి అసిస్టెంట్ డైరెక్టర్

**అవినీతి, అహంకారం దోపిడీ, దుర్మార్గానికి 'కేరాఫ్ అడ్రస్' అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్‌కు నూకలు చెల్లాయి...ఈరోజుతో పోస్టింగ్ లేదు అమరావతి మెయిన్ ఆఫీస్‌కి అటాచ్...**




# ఆదాయానికి ఏపీ చిరునామాగా ఉండాలి: చంద్రబాబు



**వినుకొండ, పతాకం న్యూస్:** చెత్త నుంచి సంపద సృష్టించడం పట్ల సంతోషంగా ఉందని సీఎం నారా చంద్ర బాబు నాయుడు నాయుడు అన్నారు. శని వారం వినుకొండలో నిర్వహించిన స్వర్ణాం ధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పా ల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. అనంతరం వినుకొండ సభలో మాట్లాడుతూ.. రాబోయే రోజులన్నీ వినుకొండకు మంచి రోజులే అని అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కోసం ఇక్కడకు వచ్చానని తెలిపారు. మండలానికి ఒక స్వచ్ఛ రథం ఇచ్చామని.. ప్రతి వారం మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ రథం తిరుగు తుందని చెప్పారు. పల్నాడు అంటేనే పౌరుషాల గడ్డ అని, ఇక్కడకు వస్తే వైబ్రే షన్స్ వస్తాయన్నారు సీఎం చంద్రబాబు. కోటప్పకొండ తిరునాళ్ల ఉత్సవాలను బ్రహ్మాండంగా చేశారని కొనియాడారు. శివరాత్రి ప్రభల కంటే కోటప్పకొండ ప్రభలు ఎంతో ఫేమస్ అని చెప్పారు. మంత్రి నారాయణ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నడుస్తున్నాయని వెల్లడించారు. తాను సీఎం అయ్యే సమ



## వైసీపీని, జగన్‌ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది: మల్లాది విష్ణు

2లో

# వైసీపీ నేతలపై కొల్లు ఫైర్



**కృష్ణా, పతాకం న్యూస్:** ఏపీ శాసనమండలిలో వైసీపీ నేతల తీరుపై మంత్రి కొల్లురవీంద్ర తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లాలోని మోపిదేవి శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ నాయకుల ప్రవర్తన చాలా దుర్మార్గంగా ఉందన్నారు. ప్రజా సమస్యల మీద మాట్లాడాల్సిన దేవాలయం లాంటి అసెంబ్లీని.. వైసీపీ సభ్యులు అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. 'జగన్ అసెంబ్లీకి రారు.. శాసనమండలిలో సభ జరగనివ్వరు' అంటూ మంత్రి విరుచుకుపడ్డారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు మద్యం పేరుతో దోచుకోవడమే కాకుండా భూములను కూడా దోచుకున్నారని కొల్లురవీంద్ర ఆరోపించారు. ఆఖరికి ప్రపంచమంతా పవిత్రంగా భావించే తిరుమల లడ్డూను కూడా కల్తీ చేశారన్నారు. తిరుమల లడ్డూలో నెయ్యి వాడకుండా నెయ్యిని సృష్టించారంటూ దుయ్యబట్టారు. కలియుగ దైవంగా భావించే వేంకటేశ్వర స్వామి పటాన్ని.. కాళ్లకు చెప్పులు వేసుకుని పట్టుకుని మరీ శాసనమండలిలో తిరిగారన్నారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## విద్వేషం..!

విద్యా కుసుమాలను వికసింపజేసే విశ్వవిద్యాలయాల్లో విద్వేష విషాన్ని చిమ్మేందుకు పరివార్ శక్తులు యత్నించడం దారుణం. విద్యాపరమైన శాస్త్ర, సాంకేతిక అంశాలతో మేధోమథనం జరగాల్సిన విద్యాలయంలో మత విద్వేషాలు వద్దన్నందుకు బుధవారంనాడు వర్శిటీతో ఏ మాత్రం సంబంధంలేని దాదాపు 50 మందికిపైగా మూకగా దూసుకువచ్చి భయోత్పాతం సృష్టించడం క్షంతవ్యం కాదు. చరిత్ర ప్రసిద్ధికెక్కిన ఆంధ్రా యూనివర్శిటీలో మతోన్మాద చర్యలను అడ్డుకోవాలని వైస్‌ఛాన్సలర్‌ను కోరేందుకు వెళ్తున్న విద్యార్థులపై దాడులకు పాల్పడడం విధ్వంసకర చర్య. కొద్ది రోజులుగా వర్శిటీతో సంబంధంలేని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన కొందరు ఎయులో ఒక పథకం ప్రకారం మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తుండగా ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాలు ఎప్పటికప్పుడు నిరసనలు తెలుపుతున్నాయి. దాన్ని సహించలేని వర్సిటీతో సంబంధం లేని ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు తమను నిలదీసిన విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై భౌతికంగా దాడి చేయగా ఒక విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. దాడి అనంతరం అయినా చేసిన తప్పునకు లెంపలు వేసుకోవడం మాని 'అధికారంలో మేమే ఉన్నాం.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు' అని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వారు నినాదాలు చేయడం బరితెగింపే! ఇంత జరుగుతున్నా ఎయు వైస్ ఛాన్సలర్, ఉన్నతాధికారులు మాటలకే పరిమితమయ్యారు తప్ప దాడులకు దిగిన గూండాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సబబు కాదు. క్యాంపస్‌లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తున్న అరాచక శక్తులపై తక్షణమే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలి. అందుకోసం విశ్వవిద్యాలయ యాజమాన్యం సిద్ధం కాకపోతే రాష్ట్రప్రభుత్వం అయినా స్పందించాలి. లేకపోతే విశ్వవిద్యాలయాల్లో మత విద్వేష వ్యాప్తికి టిడిపి, జనసేన కూడా పాల్పడుతున్నాయని రాష్ట్ర ప్రజలు భావించకతప్పదు. తనను తాను సెక్యులర్ పార్టీగా చెప్పుకొనే టిడిపి ప్రతిష్ట కోల్పోవలిసి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త!

దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యాలయాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు పడుతున్నాయి. ప్రగతిశీల గొంతుకలు వినిపించేవారిపై నిర్బంధం కొనసాగుతోంది. అసమ్మతి, విమర్శతో సహా అర్థవంతమైన చర్చలకు కేంద్రాలుగా భాసిల్లవలసిన ఉన్నత విద్యా కేంద్రాలు నేడు మతతత్వ కార్యక్రమాలకు కేరాఫ్‌గా మారుతుండడం బాధాకరం. ఇటీవల ప్రముఖ నటుడు, సామాజికవేత్త నసీరుద్దీన్ షాకు ముంబయి విశ్వవిద్యాలయం పంపిన ఆహ్వానాన్ని చివరి క్షణంలో వెనక్కి తీసుకుంది. 'క్రిటికల్ ఫిలాసఫీ ఆఫ్ క్యాస్ట్ అండ్ రేస్' పేరిట ఇటీవల న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన సమావేశం తీవ్రమైన రాజకీయ ఒత్తిడిని, పాలనా యంత్రాంగం నుంచి అడ్డంకులను ఎదుర్కోవాల్సి వచ్చింది. సమావేశంలో కులం, జాతి గురించి ఎందుకు చర్చించాల్సి వచ్చిందో, దాని వెనుక ఉన్న ఉద్దేశమేమిటో తెలుసుకునేందుకు నిజ నిర్ధారణ కమిటీని సైతం ఏర్పాటు చేశారంటే భావ ప్రకటనా స్వేచ్ఛను ఎంతలా అదిమిపెడుతున్నారో బోధపడుతోంది. అదే విధంగా 'భూమి, ఆస్తి, ప్రజాస్వామ్య హక్కులు' పేరిట సెమినార్ సిరీస్‌కు హాజరు కావలసిన సామాజిక శాస్త్రవేత్త నందినీ సుందర్‌కు ఢిల్లీ యూనివర్సిటీ అనుమతి నిరాకరించింది. ఈ ఘటనలను గమనిస్తే విశ్వవిద్యాలయాల్లో సెన్సార్‌షిప్ అనేది ఏ విధంగా అమలవుతున్నదో అర్థమవుతుంది. వర్సిటీలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలకు 'జాతీయ', 'జాతి వ్యతిరేక' ప్రాజెక్టులుగా ముద్ర వేస్తున్నారు. కులం, లింగం, మైనారిటీ హక్కులు, జాతీయ వాదం, రాజ్య హింస వంటి అంశాలపై విమర్శనాత్మక దృక్పథాలను కలిగి ఉండడాన్ని 'జాతి వ్యతిరేక' లేదా 'రాజకీయ ప్రేరేపిత'మైనవిగా ఆరోపిస్తున్నారు. తద్వారా పాలక పక్షాల సిద్ధాంతాలు, భావజాలాలే దేశభక్తిపూరితమైనవిగా ప్రచారంలోకి తేవాలని యత్నిస్తున్నారు. భిన్నత్వంలో ఏకత్వం, పరమత సహనం వంటి ఈ దేశ లక్షణాలను దెబ్బతీసేందుకు పరివార్ శక్తులు సాగిస్తున్న కుయత్నాలను భారతీయులంతా ఐక్యంగా తిప్పిగొట్టాలి. విద్యాలయాలు ప్రజాస్వామిక, లౌకిక భావనలను పెంపొందించేవిగా ఉండాలేతప్ప విద్వేష వ్యాప్తికి చోటివ్వరాదు.

## కాంగ్రెస్ కార్యకర్తల నిరసన దిగ్భ్రాంతి కలిగించింది: లోకేశ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీలో "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026"లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సృష్టించిన గందరగోళంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం, విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై వారి ప్రవర్తన దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఏఐ రంగంలో ఎదుగుతున్న భారత్ శక్తిని ప్రపంచానికి చాటేందుకు ఉద్దేశించిన సదస్సులో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు లోకేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఏఐ సూపర్ పవర్‌గా భారత్ ఎదుగుతున్న తీరును ప్రదర్శించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశం. అలాంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమాన్ని రాజకీయ వేదికగా మార్చడం ద్వారా ప్రపంచం ముందు మనందరి ప్రతిష్ఠను తగ్గించారు. ఇది దిగ్భ్రాంతికరం, విచారకరం" అని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం ఇంతకంటే మెరుగైన గౌరవానికి అర్హమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. "మనం ఇలాంటి చిల్లర రాజకీయాలను పక్కనపెట్టి, ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా దేశ నిర్మాణానికి ప్రాధాన్యత ఇద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

## కొందరు జర్నలిస్టులు మా మాటలను వక్రీకరిస్తున్నారు.. జేసీ ప్రభాకర్ రెడ్డి ధ్వజం



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని తన కుమారుడు అన్నారని.. అయితే ఈ మాటలను కొంతమంది జర్నలిస్టులు వక్రీకరిస్తున్నారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు జర్నలిస్టులు ఏది పడితే అది రాస్తున్నారని ధ్వజమెత్తారు. అస్మిత్ రెడ్డి పెద్ద తప్పు చేసినట్లు ప్రసారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. శనివారం అనంతపురం వేదికగా మీడియాతో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. తాడిపత్రిలో చేస్తున్న అభివృద్ధి ఏంటో జగన్ అండ్ కోకు తెలియదని.. వారికి చెప్పాల్సిన అవసరం లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. జగన్ హయాంలో చేసిన అప్పులకు.. తమ ప్రభుత్వం వడ్డీని కడుతోందన్నారు. ఇప్పుడు తమ గురించి మాట్లాడిన జర్నలిస్టులు.. తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధిని కూడా చూపించాలని సూచించారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నేర్పించిన విజన్‌తో బతుకుతున్నామని వ్యాఖ్యానించారు. ఏపీ అభివృద్ధి కోసం చంద్రబాబు రాత్రి, పగలు అనే తేడాలేకుండా శ్రమిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కష్టపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. వైసీపీ హయాంలో పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులను నిర్లక్ష్యంగా వదిలేశారని జేసీ ప్రభాకర్ రెడ్డి దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చంద్రబాబు అభివృద్ధి చేసినట్లే.. తాము తాడిపత్రి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. తాడిపత్రి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. ఏప్రిల్ ఆఖరికి తాడిపత్రికి సోలార్ విద్యుత్ వస్తుందని తెలిపారు. కడప, కర్నూల్‌లో లేని విధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తాడిపత్రిలో ఉందని జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

## అందరి కృషి వల్ల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తిరిగి పుంజుకుంది: రేవంత్‌రెడ్డి



**అమరావతి, పతాకం న్యూస్:** తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు.

## వైసీపీని, జగన్‌ను హిందువులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది: మల్లాది విష్ణు




**విజయవాడ, పతాకం న్యూస్:** తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్యాలు ప్రచారం చేశారని, రాష్ట్రానికి పెద్దగా, బాధ్యతగా ఉండాల్సిన వ్యక్తి స్థానానికి ఇది తగదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని సీబీఐ సిట్ చార్జ్ షీట్ లో తెలిపిందని విష్ణు అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు కూటమి నేతలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీని, జగన్ ను హిందువులకు దూరం చేసేందుకు కుట్ర పన్నారని... సీబీఐ రిపోర్టు వచ్చినా జగన్ పై బురద చల్లడం మానుకోలేదని దుయ్యబట్టారు. నెయ్యి వ్యవహారంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుందని... వారికి తగ్గట్టుగానే రిపోర్టు ఇస్తుందని అన్నారు. శాసనమండలిలో ఇందాపూర్, భోలేబాబా, హెరిటేజ్‌పై చర్చకు వైసీపీ తీర్మానం ఇచ్చినా కూటమి ప్రభుత్వం ఎందుకు తోక ముడిచిందో సమాధానం చెప్పాలని విష్ణు డిమాండ్ చేశారు. జంతువుల కొవ్వు, బాత్ రూమ్ కెమికల్స్ కలిపారని ఏ ఆధారాలతో మాట్లాడారో చెప్పాలని అన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారో కూడా వివరణ ఇవ్వాలని అడిగారు.

## కార్లతో ర్యాలీ.. అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు



**గుంటూరు, పతాకం న్యూస్:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు.

## అర్ధరాత్రి సమయంలో 50 లక్షల ఓట్లు ఎలా పోల్ అయ్యాయి?: శైలజానాథ్



**అమరావతి, పతాకం న్యూస్:** గత సంవత్సరం ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని మాజీ మంత్రి, వైసీపీ నేత సాకే శైలజానాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అనంతపురంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... అర్ధరాత్రి సమయంలో 50 లక్షల ఓట్లు ఎలా పోల్ అయ్యాయని ప్రశ్నించారు. పోలింగ్ ముగిసిన తర్వాత అర్ధరాత్రి 11.45 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు భారీగా ఓట్లు నమోదయ్యాయని శైలజానాథ్ అన్నారు. మొదట 68 శాతం పోలింగ్ జరిగిందని ప్రకటించారని... మూడు రోజుల తర్వాత 81.86 శాతం అని చెప్పారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల టోకెన్లు (పోలింగ్ ముగింపు సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి ఇస్తారు) మాత్రమే జారీ అయ్యాయని... మరి 50 లక్షల ఓట్లు ఎవరు వేశారని ప్రశ్నించారు. అర్ధరాత్రి ఆత్మలు, దెయ్యాలు వచ్చి ఓట్లు వేశాయా? అని ఎద్దేవా చేశారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ఎందుకు ఇవ్వలేదు? అని ప్రశ్నించారు. ఈ అనుమానాలకు కేంద్ర ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఏఐ పై మాజీ ఉప రాష్ట్రపతి సంచలన వ్యాఖ్యలు

**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐతో మానవ సంబంధాలు మంటగలసి పోతాయోమోనని భయమేస్తోందని, వావివరుసలు ఎక్కడ మరిచిపోతారెమోనన్న భయం నాలో ఉందని అన్నారు. దీనికి పరిష్కార మార్గాన్ని ఆయన సూచించారు. విద్వేషాలు రెచ్చగొట్టకుండా ఏఐని కట్టడి చేయాలని, ఏఐపై ఉన్న భయాలు తొలగించి ఏఐని అదుపులోకి చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. నైతిక పద్ధతుల్లో విలువలతో కూడిన సాంప్రదాయబద్ధంగా ఏఐని ఎలా ఉపయోగించుకోవాలన్నది సవాలేనని అన్నారు. లేని పక్షంలో ఏఐ మహాభూతమై సమాజాన్ని సంక్షోభమార్గంలో తీసుకు వెళుతుందని వెల్లడించారు. ఏఐ వల్ల మానవాళికి నష్టం జరుగకుండా ప్రధాని మోదీ పలు సూచనలు చేశారని వివరించారు. సమాజం కూడా ఎప్పటికప్పుడూ స్పందించి పలు సూచనలు చేయాలని కోరారు. కేంద్రంలోని నరేంద్రమోదీ, ఏపీలో చంద్రబాబు నాయుడు ఏఐని టెక్నాలజీని ముందుకు తీసుకెళుతున్నారని ప్రశంసించారు. రాజకీయ నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వాళ్లంతా ఓడిపోయారని అన్నారు.

# కొండాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్.. రూ.1,400 కోట్ల విలువైన భూమికి రక్షణ




**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ నగర శివారులోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన కొండాపూర్‌లో కబ్జాకు గురైన సుమారు 7 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.1,400 కోట్లు ఉంటుందని అంచనా. అధికారులు ఆక్రమణలను తొలగించి, శనివారం ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని సర్వే నంబర్ 78 నుంచి 93 పరిధిలో రాజరాజేశ్వరి నగర్ కాలనీ పేరుతో 1993లో గ్రామపంచాయతీ లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 5 ఎకరాలు, పాఠశాలకు ఒక ఎకరా, పార్కులకు ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం 2181 గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఈ విలువైన స్థలాలు కబ్జాకు గురయ్యాయి. పాఠశాల స్థలంలో అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ హాల్ స్థలంలో ప్రైవేటు దుకాణాలు, షెడ్లు వెలిశాయి. ఈ ఆక్రమణల వెనుక బడాబాబులు ఉన్నారని, ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను కాపాడాలని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. లేఅవుట్‌లోని ప్లాట్లు ఎల్‌ఆర్ఎస్ అయినప్పుడు, పార్కులు, ప్రజావసరాల స్థలాలు ఎలా ఆక్రమణదారుల సొంతమవుతాయని వారు ప్రశ్నించారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, అధికారులను క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. లేఅవుట్ ప్రకారం ఆ భూములు ప్రజావసరాలకు చెందినవేనని నిర్ధారించుకున్న అధికారులు, వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని తమ సమస్యకు హైడ్రా పరిష్కారం చూపడంతో రాజరాజేశ్వరి నగర్‌లోని సుమారు 5 వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమకు అండగా నిలిచిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపాయి.

## ముగింపు దశకు నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు ముగింపు దశకు రావడంతో ప్రారంభోత్సవానికి దేవదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకవర్గం సుముహూర్తం నిర్ణయించారు. మార్చి ఎనిమిదో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాలతో పాలకవర్గం చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో శ్రీధర్ ఆలయంలో మిగిలిన పనులను వేగవంతం చేశారు. అనకాపల్లి ప్రజల ఇలవేల్పు అయిన నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని నిర్మించి దశాబ్దాలు కావడం, మరోవైపు ఏటేటా భక్తులు పెరుగుతుండడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. రద్దీ అధికంగా వున్నప్పుడు భక్తులు ఒకింత అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు భావించారు. సుమారు రూ.11 కోట్ల అంచనా వ్యయంతో రెండున్నర సంవత్సరాల క్రితం పనులకు శ్రీకారం చుట్టారు. అమ్మవారి మూలవిరాట్టును మినహా మిగిలిన ఆలయం మొత్తాన్ని కూల్చివేశారు. భక్తులు దర్శించుకోవడానికి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపాన్ని బాలాలయంగా మార్చి అమ్మవారి తాత్కాలిక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ హయాంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఆలయ పునర్నిర్మాణ పనులు మందకొడిగా సాగాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ వహించి, పనులను వేగవంతం చేయించారు. ఆలయ జీర్ణోద్ధరణ, పునర్నిర్మాణ పనుల కారణంగా 2023 జూన్ నుంచి అమ్మవారి మూలవిరాట్ దర్శనభాగ్యం లేకపోవడంతో భక్తులు ఒకింత నిరాశ చెందుతున్నారు. దీంతో ఈ ఏడాది కొత్త అమావాస్య ఉత్సవాల ప్రారంభంనాటికి నూతన ఆలయం అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో పనులను వేగవంతం చేశారు. ఆలయం లోపల గచ్చు, క్యూలైన్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. విద్యుత్తు, రంగుల పనులు చివరి దశకు చేరాయి.

## ఆదాయానికి ఏపీ చిరునామగా ఉండాలి: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

యానికి రాష్ట్రంలో 108 లక్షల టన్నుల చెత్త రాష్ట్రంలో పేరుకుపోయిందని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు, గాలి ఇవ్వాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. అందుకే ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటానని సీఎం వివరించారు. మార్చి 31 నాటికి వందశాతం ఇంటి నుంచి చెత్తను సేకరించేలా చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. చెత్త ద్వారా మళ్లీ వస్తువులను ఉత్పత్తి చేస్తామని.. విశాఖలో చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. మరో ఐదు ప్లాంట్ల ద్వారా కరెంట్‌ను తయారు చేస్తామన్నారు. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను బ్యాన్ చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఏపీ శాసనమండలిలో వేంకటేశ్వర స్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు చేసిన నిరసనలపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ అంశంపై వినుకొండ సభలో సీఎం మాట్లాడుతూ.. చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటోలను విసిరేశారని మండిపడ్డారు. శ్రీవారి విషయం బయట మాట్లాడకూడదని రెండు రోజులుగా ఆగానన్నారు. వేంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారని చెబితే హెరిటేజ్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. 'నేను ప్రాణం పోయినా తప్పు చేయను' అని స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందన్నారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తప్పును పక్క వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారన్నారు. అలాంటి కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయం చేయాలా అని విమర్శించారు. తాను కూడా జైలుకు వెళ్తానని ఊహించలేదని.. నోటీసు ఇస్తే సమాధానం చెప్పేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు... రాష్ట్రం కోసం పోరాడా' అని చెప్పుకొచ్చారు. చాలా మంది తాను జైల్లో నుంచి ప్రాణాలతో బయటకురారని అనుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మట్లాడుతున్నారని.. రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వివేకా హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని.. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవేదన కలిగించిందన్నారు. కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని తెలిపారు.

## గ్లోబల్ ఎఐ సమ్మిట్‌లో ఎపిఇపిడిసిఎల్ సేవలకు ప్రశంస




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సంప్రదాయ విద్యుత్ పంపిణీ సంస్థను సాంకేతిక ఆధారిత, డిజిటల్ ఆధారిత సమగ్ర వ్యవస్థగా మారుస్తున్న ఉత్తమ నమూనాగా ఎపిఇపిడిసిఎల్ న్యూఢిల్లీలోని అంతర్జాతీయ ఎఐ సమ్మిట్‌లో ప్రశంసలు అందుకుంది. గ్లోబల్ ఎఐ సమ్మిట్‌లో సంస్థ సిఎండి డాక్టర్ ఇమ్మడి పృథ్వీ తేజ్ పాల్గొని, ఎపిఇపిడిసిఎల్‌లో అమలులో ఉన్న అత్యాధునిక జిఐఎస్ మ్యాపింగ్ వ్యవస్థపై రూపొందించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. సంస్థలో డిజిటల్ మార్పులు, ముఖ్యంగా ఎండ్ టు ఎండ్ జిఐఎస్ ఆధారిత ఆస్తి మ్యాపింగ్, డిజిటల్ ట్విన్ కాన్సెప్ట్, ఎఐ ఆధారిత గ్రిడ్ విశ్వసనీయత వ్యవస్థపై వివరణాత్మకంగా ప్రదర్శించారు. ఇప్పటికే సంస్థ పరిధిలోని విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, సబ్‌స్టేషన్లు వంటి అన్ని నెట్‌వర్క్ ఆస్తులను పూర్తిగా జిఐఎస్‌లో మ్యాప్ చేసి, వాటిని ఒక సమగ్ర డిజిటల్ ఎకోసిస్టమ్‌గా అభివృద్ధి చేసిన విధానాన్ని సిఎండి వివరించారు. ఈ జిఐఎస్ వ్యవస్థను ఎస్‌ఎపిఇఆర్‌పి, అవుటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఒఎంఎస్), మొబైల్ ఫీల్డ్ యాప్స్‌తో అనుసంధానం చేయడం ద్వారా రియల్‌టైమ్ మానిటరింగ్, వినియోగదారులకు వేగవంతమైన సేవల అందిస్తున్న పద్ధతిని వివరించారు. ఎఐ ఆధారిత ఎలక్ట్రిక్ గ్రిడ్ రిలయబిలిటీ సిస్టమ్ ద్వారా స్మార్ట్‌ఫోన్ ఆధారిత తనిఖీలతో వాలిన స్థంభాలు, క్రాస్‌ఆర్మ్ టిల్ట్, విరిగిన,తుప్పు, భద్రతా లోపాలను గుర్తించే విధానాన్ని వీడియోలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు గ్లోబల్ ఎఐ సమ్మిట్‌లో పాల్గొన్న ప్రపంచ స్థాయి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంధనరంగ నిపుణులు, విధాన నిర్ణేతలు, సాంకేతిక సంస్థల ప్రతినిధుల నుంచి విశేష స్పందన, ప్రశంసలు అందుకుంది. ఎపిఇపిడిసిఎల్ భవిష్యత్ చర్యల్లో భాగంగా ఎఐ ఆధారిత కమర్షియల్ లాస్ డిటెక్షన్, ఇంటెలిజెంట్ యుటిలిటీ ఆపరేషన్ సెంటర్ (ఐయుఒసి) స్థాపన, రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్, డిమాండ్ రెస్పాన్స్ వంటి ఆధునిక విధానాలను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.డిజిటలైజేషన్ నుండి స్పేషియల్ ఇంటెలిజెన్స్ దిశగా తమ సంస్థ ప్రయాణం దేశానికి, అంతర్జాతీయ వేదికలకు ఆదర్శంగా నిలుస్తుందని సీఎండి పృథ్వీతేజ్ తెలిపారు.

## వెనుకబడిన వర్గాల సాధికారతతో సామాజిక న్యాయం




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** సమాజంలో వెనుక బడిన వర్గాల సాధికారతతోనే సామాజిక న్యాయం లభిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. సింగుపురం గ్రామం లో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు లో ఎక్కడైనా అసమానతల్నున్నా, అర్హులైన వారికి ఫలాలు అందక పోయినా బాధితులు తక్షణం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్ర దిస్తే వారికి ఉచితంగా న్యాయ సేవలు అందించి వారికి దక్కాల్సిన హక్కులను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్యామ్ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**అరసవల్లి, పతాకం న్యూస్:** పీఏసీఎస్ ఉద్యోగుల న్యాయ మైన సమస్యలను పరిష్క రించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. కోర్కెల సాధనకు ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అనేకపర్యాయాలు ప్ర భుత్వానికి వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవ డంతో తప్పని పరిస్థితుల్లో నిరవధిక దీక్షలకు దిగారన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని, చాలీచాలని వేతనాలతో కుటుం బాలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పీఏసీఎస్ ఉద్యోగులకు జీవో నెంబర్ 36 అమలు, వేతన సవరణ చేయాలని, 50 శాతం తగ్గ కుం డా మధ్యంతర భృతి ఇవ్వాలని, పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిబుచ్చి రంగనాథ్, జిల్లా కార్య దర్శి మెండ సత్యనారాయణ, సంఘ నేతలు బొడ్డేపల్లి సన్యా సిరావు, కనుగుల రమణ, జానకి రామ్ తది తరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



**మల్కాపురం, పతాకం న్యూస్ :** పీఎం శ్రీ జివిఎంసీ హై స్కూల్, మల్కాపురం లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో "100 మంది కవులు-చిత్రాల ప్రదర్శన" ఆకట్టుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు కవుల చిత్రాలను సందర్శించి వారి సాహిత్య సేవలను స్మరించుకున్నారు. అలాగే "మా తెలుగు తల్లికి మల్లెపూలు దండ" పాటతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడాయి. విద్యార్థుల ప్రదర్శనలు హాజరైన వారిని అలరించాయి. మాతృభాష పరిరక్షణ, ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు శివరామ కృష్ణ సందేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.అరుణ కుమారి,ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పి. సింహాచారి,శైలజ, నీల కుమారి,లక్ష్మీకాంతం,హరికృష్ణ,మిగతా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మాతృభాష గౌరవాన్ని ప్రతిపాదించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది అని ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి అన్నారు.

## డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలు వద్దు

**22 నుండి జన జాగృతి బైక్ యాత్ర.. డివైఎఫ్ఐ గోడ పత్రిక ఆవిష్కరణ**




**మల్కాపురం, పతాకం న్యూస్ :** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు వెంకన్నపాలెం ఆఫీసులో జన జాగృతి బైక్ యాత్ర గోడ పత్రికను విడుదల చేశారు. డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ అధ్యక్షులు బి శ్రీను కార్యదర్శి ఎస్ వాసు జిల్లా కమిటీ సభ్యులు సమీర్ మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలకు యువత బానిసలైపోయి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వాలు యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో యువత డ్రగ్స్ గంజాయి చెడు వ్యసనాలకు గురై యువత జీవితాలు కుటుంబాలు నాశనం అవుతున్నాయని అన్నారు. డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలు మాఫియా గ్యాంగ్లను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మండిపడ్డారు. యువతీ యువకులకు విద్యార్థులకు ప్రజలకు పిల్లల కుటుంబాలకు డ్రగ్స్ గంజాయి మత్తుపదార్థాల వలన వచ్చే నష్టాలు ప్రమాదాలు తెలియజేయడానికే భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఫిబ్రవరి 22 నుండి 28 వరకు బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు 22న శ్రీహరిపురం వాకింగ్ పార్కు వద్ద 7 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు వారం రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోడ పత్రిక విడుదల చేసిన వారిలో జి.నరేష్ ఏ. ప్రశాంత్ గౌరునాయుడు, కోటేశ్వరరావు కనకరాజు,వెంకటేష్ ,పోలా అప్పారావు,పి.శ్రీను తేజ గణేష్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు

## ఏయూలో ఆర్‌ఎస్‌ఎస్ మత కార్యక్రమాలు అరికట్టాలి : విద్యార్థి సంఘాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులపై ఆర్‌ఎస్‌ఎస్ దాడులను విద్యార్థి సంఘాలు ఖండించాయి. ఆర్‌ఎస్‌ఎస్ మత పరమైన కార్యక్రమాలు యూనివర్శిటీలో జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన, దళిత గిరిజన, బిసి విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. యూనివర్శిటీలో ఆర్‌ఎస్‌ఎస్ సృష్టిస్తున్న మత కార్యక్రమాలు నిలిపివేయాలని కోరినందుకు విద్యార్థులపైన, విద్యార్థి సంఘల నాయకులపై చేస్తున్న దాడులను తప్పు పట్టింది. వారం రోజుల నుండి ఆర్‌ఎస్‌ఎస్ ఆరాచకాలతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు. ఛలో యూనివర్శిటీ పేరుతో 'ఎబివిపి' ముసుగులో ఆర్‌ఎస్‌ఎస్ మూకలు విద్యార్థి సంఘ నాయకులపై దాడులకు దిగి తీవ్ర భయానిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ ఆందోళనకర పరిస్థితులు రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలిసినా ఇప్పటి వరకు స్పందించలేదు. రాష్ట్ర ప్రభుత్వ తీరు ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల అరాచకాలకు మరింత ఊతం ఇచ్చేందుకు ఉపయోగపడుతున్నది. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలి. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ లు చేస్తున్న దాడులపై చర్యలు తీసుకోవాలి. తక్షణమే వీరిని అరెస్ట్ చేసి క్రిమినల్ కేసులు పెట్టాలి. ఆంధ్రా యనివర్సిటీ విద్యార్థులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. యూనివర్శిటీ నిబంధనలు ధిక్కరించి ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ లు విద్యార్థుల క్రీడా మైదానాన్ని ఆక్రమించి గత 10 రోజులుగా మతపర కార్యక్రమాలు, కర్రలతో కవాతులు, కాషాయ జెండాలు పాతటం, ఇతర మతస్తులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి గ్రౌండ్లో భయానికమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. క్రీడలు అడుకునే విద్యార్థులకు తీవ్ర ఆటంకం కల్పించటమేగాక బెదిరింపులకు పాల్పడ్డారు. జాతీయ జెండాలు ఎగరాల్సిన యూనివర్శిటీలో బలవంతంగా కాషాయజెండాలు కట్టటానికి ప్రయత్నం చేసారు. మత పరమైన చర్యలు విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకంగా మారాయి.ఈ పరిస్థితుల్లో విద్యార్థులు, వివిధ విదార్థి సంఘాల నాయకులు వైస్ ఛాన్సలర్ను కలిసి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను ఆంధ్రా యూనివర్శిటీలో నిషేధించాలని, యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కోరారు.

## గిరిశిఖర గ్రామాల్లో కానరాని పక్కా ఇళ్లు



**మక్కువ, పతాకం న్యూస్:** దశాబ్దాలు గడుస్తున్నా... గిరిశిఖర గ్రామాల ప్రజలు పక్కా ఇళ్లకు నోచుకోవడం లేదు. మక్కువ మండలంలో నేటికీ అనేక మంది గిరిజనులు పూరి గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎంతమంది ప్రజాప్రతి నిధులు మారినా.. వారి బతుకులు మాత్రం మారడం లేదు. మండలంలోని బాగుజోల, చెలకమెండంగి, తాడిపుట్టి, కొంజపాక, సిరివర, పిరిడిపాక, బెలుగొండ, పొయ్యిమాల గ్రామాల్లో గిరిజనులకు పక్కా గూడు లేదు. మట్టిగోడలపై పెంకులు, రేకులు వేసుకుని నిర్మించుకున్న ఇళ్లలోనే ఇప్పటికీ నివసిస్తున్నారు. గృహ నిర్మాణ ప?థకం అమలు చేస్తున్నా.. నిరుపేదలైన గిరి జనులు డబ్బులు లేక గృహ నిర్మాణం చేపట్టలేకపోతున్నారు. కొండలపైన గ్రామాలకు సిమెంటు, ఐరెన్, మెటల్, ఇటుక తీసుకెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం కూడా మరో కారణంగా ఉంది. మక్కువతో పాటు అన్ని మండలాల్లోని గిరిశిఖర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు గిరిశిఖర గ్రామాల్లో మౌలిక వసతులు కొరవడ్డాయి. సీసీ రోడ్డు, కాలువల నిర్మాణాలు చేపట్టకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రాళ్లను గుట్టలుగా పేర్చుకొని వర్షాకాలంలో వారి ఇళ్లు కోతకు గురికాకుండా చూసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిరిశిఖర గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చాలని గిరిజనులు కోరుతున్నారు.

## స్వచ్ఛాంధ్రకు సహకరించాలి



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. స్వచ్ఛాంధ్రకు అందరూ సహకరించాలని ఆమె అధికారులను కోరారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం మండలానికో స్వచ్ఛ రథం కేటాయిం చిందని తెలిపారు. వ్యర్థాల సేకరణ వేగవంతం చేసి నియోజకవర్గాన్ని అన్ని విధాలా ముందంజలో ఉంచా లని కోరారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. పారిశుధ్య కార్మికుల కు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎ స్ అధ్యక్షులు కోళ్ల శ్రీను, కనకల శివ, జనసేన సమన్వ యకర్త ఒబ్బిన సత్యనారాయణ, టీడీపీ పార్లమెంటు ఉపాధ్య క్షుడు గొరపల్లి రాము, బీసీ సెల్ అధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, దుర్గా ఉమేష్, కొరుపోలు అప్పారా వు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోల మూసివేతపై నిరసన




**పార్వతీపురం, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఆర్టీసీ డిపోల మూసివేత, ప్రయివేటు కంపెనీలకు ఆస్తుల అప్పగింతలకు నిరసనగా స్థానిక డిపో గేట్ వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కార్యదర్శి ఎఎస్ నాయుడు అధ్యక్షతన కార్యక్రమంలో జోనల్ నాయకులు బివి రావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ప్రజల విలువైన ఆస్తులను కాపాడుకోవాలన్నారు. ప్రస్తుతం ఆర్‌టిసిలో తీవ్ర మార్పులు వేగవంతంగా వస్తున్నాయన్నారు. ప్రైవేటీకరణ స్థాయి నుంచి డిపోల మూసివేత వైపు వేగంగా మార్పులు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం జిసిసి పద్ధతిలో విద్యుత్ బస్సులను నడపడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎపిఎస్ ఆర్టీసీలో 750 ప్రైవేటు విద్యుత్ బస్సులు 11 నగరాల్లో 12 డిపోలలో పూణేకు చెందిన పినాకిల్ కంపెనీ ద్వారా ప్రవేశిస్తున్నాయన్నారు. డిపోల్లో సగం గ్యారేజీలను ఈ కంపెనీకి ఇవ్వనున్నారన్నారు. ఇవేకాక ప్రైవేట్ విద్యుత్ బస్సుల కోసం సివిల్, ఎలక్ట్రికల్ పనుల కోసం విశాఖపట్నంలోని సింహపురి డిపోను, మంగళగిరిలో అమరావతి డిపోను గ్రీన్ ఫీల్డ్ డిపోలుగా ప్రైవేట్ పరం కానున్నాయన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో 31 డిపోల మూసివేత వల్ల అక్కడ పని చేసే 9వేలమంది ఆర్టీసీ సిబ్బంది ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు కనుమరుగై మొత్తం ప్రైవేట్ విద్యుత్ బస్సులు వచ్చి ఎపిఎస్ఆర్టీసీ బోర్డు మాత్రమే మిగులుతుందన్నారు. కావున డిపోల మూసివేతకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ విద్యుత్ బస్సుల స్థానంలో వెంటనే మూడువేల డీజిల్ బస్సులు కొనాలన్నారు. 11వేల మంది రెగ్యులర్ కార్మికుల రిక్రూట్మెంట్ను చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మౌలిక సదుపాయాల కల్పన పేరుతో ఆర్టీసీ బస్టాండ్లు, విలువైన స్థలాలు ప్రైవేట్ కార్పొరేటర్లకు 33/99 సంవత్సరాల పాటు లీజికిచ్చే విధానాన్ని ఆపాలని డిమాండ్ చేశార. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు, సిఐటియు మండల కార్యదర్శి కాదా రాము, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సిహెచ్.సంజీవి, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధి పెదగాడ రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్.. న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం




**మక్కువ, పతాకం న్యూస్:** న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్ కు ఆమోదం తెలిపారు. భారత్ సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలిపాయి. ఇది ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థికవృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం, అందరి ఆనందం)' అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది.

'వసుధైవ కుటుంబం (ప్రపంచమంతా ఒకే కుటుంబం)' అనే భావనతో అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం లాంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు.

## ఖాళీ స్థలాలపై 50 శాతం పన్ను రాయితీ



**బొబ్బిలి, పతాకం న్యూస్:** ఖాళీ జాగాలపై వీఎల్‌టీ(వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) 50 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రియల్ ఎస్టేటర్లు, భవన నిర్మాణదారులకు ఊరటే. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ రాయితీకి సంబంధించిన జీవో విడుదల చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరోసారి రాయితీని సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. పట్టణాల్లో ఖాళీగా ఉన్న నివేశనా స్థలాలపై ఇంతవరకు 0.2 శాతం చొప్పున మునిసిపాలిటీలు పన్ను వసూలు చేస్తున్నాయి. ఇక నుంచి 0.1 శాతం చెల్లిస్తే చాలు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పొందుపరిచిన భూముల విలువ ఆధారంగా ఈ పన్నును వసూలు చేస్తారు. రియల్ఎస్టేట్ రంగం మందగమనంతో ఉన్న నేపథ్యంలో ఈ వీఎల్‌టీ రాయితీ కొంత ఉపశమనంగా వారు భావిస్తున్నారు. ఇప్పటికే బీపీఎస్, ఎల్ఆర్ఎస్ అమలులో ఉన్నాయి. వీటికి తోడు వీఎల్‌టీ రాయితీని ప్రకటించడం రియల్ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చినట్లుగా వ్యాపారులు, ఖాళీ స్థలాల యజమానులు అంటున్నారు. బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలాలకు సంబంధించిన అసెస్మెంట్లు 1350 ఉన్నాయి. వాటి నుంచి ఏటా రూ.1.02 కోట్ల వీఎల్‌టీ వసూలు కావాల్సి ఉంది. ఆ ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం వాటి యజమానులు దరఖాస్తు చేసుకున్నప్పుడు వీఎల్‌టీలో 50 శాతం రాయితీ వర్తిస్తుంది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) కోసం మునిసిపాలిటీకి దరఖాస్తు చేసుకున్నప్పుడు కూడా ఈ పన్ను రాయితీ వర్తిస్తుంది.

## శ్రీముఖలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఆదాయం రూ. 7.31 లక్షలు



**జలుమూరు, పతాకం న్యూస్:** శ్రీముఖలింగేశ్వరస్వామి మహా శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని రు.7,31,098లుఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఏడుకొండలు తెలిపారు. దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్ ఆదేశాలు మేరకు మందస గ్రూపు దేవాలయాలు కార్యనిర్వ హణా ధికారి ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీని తెరచిలెక్కించారు.ఈ సం దర్భంగా హుండీ ద్వారా రు.4,14,818లు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రు.2,40,520లు, కేశఖండన ద్వారా రు.2160లు, వివిదరకాలుగా రు.73,600లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ శివప్రసాద్ పాడి, పాలకమండలి సభ్యులు, కొమనాపల్లి సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు: నాదెండ్ల



**అమరావతి, పతాకం న్యూస్:** జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.

## మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు



**బొబ్బిలి, పతాకం న్యూస్:** మహిళలు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి హెచ్చరించారు. ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం జరిగిన ఘటన తన దృష్టికి రాలేదన్నారు. మహిళల భద్రతకు తాను ప్రాధాన్యమిస్తానన్నారు. కళాశాల విద్యార్థినులను కలిసి ధైర్యం చెబుతానన్నారు. గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మరలా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఏం సహకారం కావాలన్నా చేసేందుకు తమ శాఖ సిద్ధంగా ఉందని, 100కి ఫోన్ చేసి చెప్పినా స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గురువారం జరిగిన ఘటనపై కళాశాలకు వెళ్లి విద్యార్థినులతో డీఎస్పీ మాట్లాడారు. జరిగిన ఘటనపై ఆరాతీశారు. లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలు జరిగితే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్‌తో ఆమె చర్చించారు.

## వైసీపీ సభ్యులు క్షమాపణ చెప్పాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** కాళ్లకు చెప్పులు తీయకుండా శాసనమండలిలోకి వేంక టేశ్వరస్వామి ఫోటోలను తీసుకువచ్చి హిందూ సమా జం తలదించుకునేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వైసీ పీ సభ్యులు క్షమాపణ చెప్పాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. జిల్లా కేం ద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. సభలోకి వచ్చి దేవుడుతో రాజకీయం చేయడం తగద న్నారు. వారి తీరుకు తీవ్ర అభ్యంతరాన్ని తెలియజేస్తు న్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి అండ్ టీం హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## 'యువతను బోధించడం సవాలు, ఆనందం' అనే అంశంపై సదస్సు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** యువ మేధస్సులోని శాస్త్రీయ ఊహాశక్తిని, పరిపక్వమైన ఉపాధ్యాయులు వాటిని శ్రద్ధ దృక్పథంతో గుర్తించి, ప్రోత్సాహిస్తే అది ఎన్నో ఉద్యోగ అవకాశాలను సష్టించగలదని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అధ్యాపకుడు, పోస్టల్ సర్వీస్ బోర్డు మాజీ సభ్యుడు, ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ ఉదరు బాలకృష్ణన్ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, ద్వారకా గ్రంథాలయం ఆధ్వర్యంలో 'యువతను బోధించడం సవాలు, ఆనందం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణన్ మాట్లాడుతూ విద్యార్థిలోని ప్రతిభా కిరణాలను కేవలం ఆసక్తి, సహానుభూతితో కూడిన ఉపాధ్యాయుడే గుర్తించగలడని, కృత్రిమ మేధస్సు కాదన్నారు.. కత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతున్న నేటి యుగంలోనూ, మానవ సహానుభూతి దృష్టి బోధనలో అమూల్యమైనదన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రసన్న కుమార్, గ్రంథాలయం కార్యదర్శి డిఎస్. వర్మ, డాక్టర్ వెంకటేశ్వర్లు, కెసి రెడ్డి, డాక్టర్ మధుకుమార్, ప్రొఫెసర్ నిరూపరాణి, దుర్గారాణి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### లంచం తీసుకుంటూ
## ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్



**పెద్దపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## రాజమండ్రి, నర్సాపురం నేతలకు ఉండవల్లిలో లోకేశ్ ఆత్మీయ విందు



**పెద్దపల్లి, పతాకం న్యూస్:** రాజకీయాల్లో కుటుంబ విలువలకు, సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. కూటమిలోని ప్రజాప్రతినిధుల కోసం ఆయన ఏర్పాటు చేస్తున్న ఆత్మీయ విందు సమావేశాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా రాజమండ్రి, నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులకు ఘనంగా ఆతిథ్యమిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల కోసం ఉండవల్లిలోని తన నివాసంలో కుటుంబసమేతంగా విందు ఏర్పాటు చేశారు. కృష్ణా నది ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం వనభోజనాలను తలపించింది. గోదావరి జిల్లాల నుంచి వచ్చిన అతిథులకు లోకేశ్ దంపతులు ఘన స్వాగతం పలికి, మర్చిపోలేని ఆతిథ్యం ఇచ్చారు. పెద్దల మధ్య సంభాషణలు, పిల్లల ఆటపాటలు, మహిళల పలకరింపులతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నేతలంతా తమ కుటుంబాలతో హాజరై.. కూటమి అంటే మూడు పార్టీలు కాదని, అదొకటేనని చాటిచెప్పారు. ఈ సందర్భంగా నేతలు మంత్రి లోకేశ్ పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తనకు ఎంతో ఇష్టమైన రత్నం పెన్‌ను లోకేశ్ కు బహుమతిగా ఇచ్చారు. నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్.. లోకేశ్, బ్రాహ్మణి దంపతుల చిత్రాన్ని వస్త్రంపై ఎంతో కళాత్మకంగా ఎంబ్రాయిడరీ చేసి కానుకగా అందించారు. విందు అనంతరం మహిళలందరికీ లోకేశ్ దంపతులు మంగళగిరి పట్టుచీరలను బహూకరించారు. ఈ ఆత్మీయ విందుకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు తమ కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు.

## పీఎస్ఎల్వీ-సీ62 వైఫల్యంపై విశ్లేషణ కమిటీ
### కె.విజయరాఘవన్ అధ్యక్షతన కేంద్రం ఏర్పాటు



**సూళ్లూరుపేట, పతాకం న్యూస్:** పీఎస్ఎల్వీ-సీ 62 రాకెట్ ప్రయోగ విఫలంపై కేంద్ర ప్రభుత్వం విశ్లేషణ కమిటీని నియమించింది. ఈ ఏడాది జనవరి 12న శ్రీహరికోటలోని షార్ నుంచి ప్రయోగించిన ఈ రాకెట్ సాలిడ్ మోటారులో సాంకేతిక లోపం తలెత్తి ప్రయోగం విఫలమైన విషయం తెలిసిందే. గత ఏడాది మే 18న పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం కూడా మూడో దశలో సాంకేతిక సమస్యతో విఫలమైంది. దీన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. పీఎం మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కె.విజయరాఘవన్ అధ్యక్షతన మాజీ ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ సహాధ్యక్షుడిగా విశ్లేషణ కమిటీని నియమించింది. దీంతో షార్ సెంటర్‌తో పాటు తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ సెంటర్‌కు వెళ్లి ప్రయోగ వైఫల్యానికి కారణాలను సభ్యులు పరిశీలించారు.

# లక్ష్యం చేరేది ఎప్పటికో..?



**అమరావతి, పతాకం న్యూస్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. క్రమంగా ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతొందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేరు మార్చి చేసి నిర్వీర్యం చేసేందుకు అనేక మార్గాలను అన్వేషిస్తుందంటూ వ్యవసాయ కార్మికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు, నగరాలకు వలసలు నివారించేందుకు వామపక్ష పార్టీల పోరాటంతో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నాటి యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధిని కల్పించి, గ్రామీణ పేదరికాన్ని లేకుండా చేయాలన్నదే ఈ చట్టం లక్ష్యం. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత చాలా మేరకు గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గాయి. ఈ చట్టం ద్వారా ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వాల మీద ఆర్థిక భారం లేకుండా కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్రప్రభుత్వం 10 శాతం నిధులు భరించేలా ఈ చట్టాన్ని రూపొందించారు. మొత్తం ఖర్చులో 60 శాతం కూలీలకు, 40 శాతం అభివృద్ధి పనులకు ఖర్చు చేసేలా ఈ చట్టాన్ని రూపకల్పన చేశారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఈ చట్టం ద్వారా చేపట్టారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ చట్టం యొక్క పేరును మార్చడమే కాకుండా కేంద్ర నిధుల వాటాను 90 శాతం నుంచి 60 శాతానికి తగ్గించింది. తద్వారా రాష్ట్రాలపై ఆర్థిక భారాన్ని పెంపుదల చేసింది. దీంతో ఈ చట్టం యొక్క మౌలికమైన లక్ష్యాలను తుంగలో తొక్కేలా కేంద్ర ప్రభుత్వం విబి గ్రామ్‌జీ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారం జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకబాటు కనిపిస్తోంది.జిల్లాలో 2,29,282 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1,46,859 జాబ్ కార్డుదారులు రెగ్యులర్‌గా పనులకు వెళు తున్నారు. వీటి పరిధిలో 2.3 లక్షల వేతనదారులున్నారు. ఒక్కో వ్యక్తికి రోజుకు సగటున రూ.281.79 చెల్లిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం 10 వేల మంది లోపు మాత్రమే ఉపాధి పనులకు వెళుతున్నారు. అయితే ఉపాధి హామీ చట్టం ద్వారా వేతనదారులకు లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనులు కల్పించ లేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అనేకమంది వ్యవసాయ కార్మికులు ఉపాధి లేక వస్తువులతో కాలం వెళ్ళదీస్తున్నారు.అరకొర పని దినాలుజిల్లాలో లక్ష్యాలకు అనుగుణంగా పని దినాలు కల్పన జరగడం లేదని వ్యవసాయ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సగటున ఒక్కో కుటుంబానికి ఇప్పటి వరకు 32.8 రోజులు మాత్రమే పని దినాలు కల్పించారు. జిల్లాలో పనులకు వెళు తున్న కుటుంబాల సంఖ్యకు పని దినాల కల్పనకు పొంతన కనిపించడం లేదు. ఈ ఏడాది మార్చితో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ప్రతి సంవత్సరం సగటున 50 నుంచి 60 రోజులు పని దినాలు కల్పించాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 40 రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ నేపథ్యంలో సగటు పని దినాల సంఖ్య ప్రశ్నార్థకంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సుమారు 1.47 లక్షల కుటుంబాలు ప్రస్తుతం పనులకు వెళుతున్నాయి. వీరికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 48.17 లక్షల పని దినాలను కల్పించారు. అయితే జిల్లా సగటును చూసుకుంటే 100 రోజులు పని దినాల సంఖ్య తక్కువగా ఉండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. జిల్లా వ్యాప్తంగా 1.46 లక్షల కుటుంబాలు పనులకు వెళుతుండగా ఇప్పటి వరకూ 1,281 కుటుంబాలకు మాత్రమే 100 రోజులు పని దినాలను కల్పించారు. గతంలో రోడ్ల పక్కన తుప్పలు, కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపు, పొలాల్లో ఎత్తు, పల్లాలను సరిచేయడం వంటి పనులు ఉండేవి. కాలువలలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు ఉపాధి కూలీలు పనిచేసేవారు అయితే ఐదేళ్ల క్రితం ఈ పనులను ఉపాధి చట్టం నుంచి తొలగించడంతో వ్యవసాయ కార్మికులకు పూర్తిస్థాయిలో పనులను కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. చట్టంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలను కల్పించాలని స్పష్టంగా ఉన్నప్పటికీ అధికారులు ఆమేరకు పనులను చూపలేకపోతున్నారు. ఈ చట్టంలోని అనేక పనులను ప్రభుత్వం తొలగించడమే ప్రధాన కారణంగా నిలుస్తోంది. మరోవైపు చేసిన పనులను ఏడాది వరకూ చేయడానికి వీలు లేకుండా సాంకేతిక కారణాలు అడ్డు వస్తున్నాయి. ఉపాధి పనులకు వెళ్లే కూలీల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పనుల సంఖ్యను కుదిస్తూ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందనే విమర్శలు లేకపోలేదు. ప్రస్తుతం కాలువలు, చెరువుల గట్లు సరి చేయడం, పుంతల్లో మొక్కలు పెంపకం, కంపోస్ట్ షెడ్లను సరి చేయడం, గడ్డి పెంపకం, వేసిన మొక్కలు, చెట్లు చుట్టూ నీరు నిల్వ ఉండేందుకు గోతులు, తీయడం వంటి పనులు మాత్రమే చెబుతున్నారు. ఇంకో వైపు ఒక్కో వ్యక్తికి రోజుకి రూ. 307 రావాల్సి ఉంది. ప్రస్తుతం రూ.281.79 మాత్రమే వేతనంగా వస్తుంది. రెండు వారాలకు ఒకసారి వేతనాలు జమ కావలసి ఉంది. కానీ ప్రభుత్వ తీరుతో నెలలు తరబడి వేతనాలు వ్యవసాయ కార్మికులకు అందని పరిస్థితి ఏర్పడింది. ఉపాధి నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్ళిస్తుండడంతో 2 నుంచి 3 నెలల పాటు వేతనాలు అందడం లేదు.

## 'సూర్యఘర్' అమలులో పురోగతి సాధించాలి



**మదనపల్లె, పతాకం న్యూస్:** పీఎం సూర్య ఘర్, పిఎం కుసుం కార్యక్రమాల అమలులో మంచి పురోగతి సాధించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్న క్యాంటీన్ల నిర్వహణ, బిసి, ఎస్సి, ఎస్టి సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు, మున్సిపల్ సేవలు, పారిశుధ్యం, గంజాయి, శాంతిభద్రతలు తదితర శాఖలపై ప్రజల నుంచి సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణ, పీఎం కుసుం, పీఎం సూర్యఘర్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అమరావతిలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, రాష్ట్ర సచివాలయంలో ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల నిర్వహణ సజావుగా జరగాలని, మున్సిపల్ సేవలు ప్రజలకు సంతృప్తికర స్థాయిలో అందించాలని, శాంతి భద్రతలపై జీరో టోలరెన్స్ ఉండాలని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుం పథకాలపై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకాలను జిల్లాలో లక్ష్య సాధనదిశగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

జిల్లాలో ఈ పథకాలను వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు ప్రధానంగా సంక్షేమ వసతి గృహాల్లో వసతులు, పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, సజావుగా గ్యాస్ సరఫరా, నాణ్యమైన విద్యుత్ సరఫరా, ఎస్సి కార్పొరేషన్ రుణాల రికవరీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటర్మీడియట్, టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులకు ఆయా శాఖల అంశాలకు సంబంధించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశానికి జిల్లా సంయుక్త కలెక్టర్ శివ నారాయణ శర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు మదనపల్లి కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు

## అదనంగా 15 శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



**కడప, పతాకం న్యూస్:** ఎపి మార్క్ ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు చేసేందుకు ఇటీవల వైఎస్ఆర్ కడప జిల్లాలో 6 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని, మరో 15 అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఈనెల 21 నుంచి ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 80,103 హెక్టార్లలో శనగ పంట,1,015 హెక్టార్లలో కంది, 16,257 హెక్టార్లలో మినుము, 1,529 హెక్టార్లలో పెసలు పంటలు సాగు చేశారన్నారు.

రైతులు పండించిన శనగ, కంది, మినుము, పెసలు పంటలను ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ద్వారా విక్రయించాలనన్నారు. జిల్లాకు సంబంధించి ఎపిమార్క్‌ఫెడ్ ద్వారా శనగ 18,532 మెట్రిక్ టన్నులు, కంది 108 మెట్రిక్ టన్నులు, మినుములు 21,931 మెట్రిక్ టన్నులు, పెసలు 234 మెట్రిక్ టన్నుల జిల్లాకు కేటాయించారని జెసి తెలిపారు. జిల్లాలోని రైతులు తమ శనగ పంటను దళారుల చేత మోసపోకుండా, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని తెలిపారు. రైతు సోదరులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అదనంగా కొనుగోలు కేంద్రాలను పెద్దముడియం, ఎర్రగుంట్ల, మైలవరం, కొండాపురం, ముద్దనూరు -2, రాజుపాలెం, దువ్వూరు, వల్లూరు, పెండ్లిమర్రి, సింహాద్రిపురం, వి.యన్ పల్లి, వేముల, వేంపల్లి, లింగాల, పోరుమామిళ్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కేరళలో నెరవేరిన పేదల సొంతింటి కల



**కేరళ, పతాకం న్యూస్:** కేరళలో పేదల సొంతింటి కల నెరవేరింది. లైఫ్ మిషన్ ద్వారా ఐదు లక్షల ఇళ్లను కేరళలో విజయన్ ప్రభుత్వం నిర్మించింది. రాష్ట్రంలో నిరాశ్రయులైన , భూమిలేని కుటుంబాలకు సురక్షితమైన గృహాలను అందించే లక్ష్యంతో మే 23, 2017న ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం లైఫ్ మిషన్ ద్వారా గృహనిర్మాణ పథకాన్ని ప్రకటించింది. అప్పటినుంచి ఈ కార్యక్రమం రాష్ట్రంలోని అత్యంత ముఖ్యమైన సంక్షేమ కార్యక్రమాలలో ఒకటిగా సాగింది. ఈనెల 24న పూజప్పురలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఐదు లక్షల ఇళ్ల మైలురాయిని అధికారికంగా ప్రకటించనున్నారు. జనవరి 31 వరకు అందుబాటులో ఉన్న అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా 4,82,736 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది, 1,17,874 ఇళ్ల నిర్మాణం ప్రస్తుతం వివిధ దశల్లో ఉంది. హడ్కో రుణం నుంచి మొదటి విడతలో రూ.400 కోట్లు విడుదల చేయడంతో ఈ పథకంలో నిర్మాణ కార్యకలాపాలు గణనీయంగా వేగవంతమయ్యాయని అధికారులు తెలిపారు. ఇప్పుడు ఆర్థిక సహాయం అందుబాటులో ఉండటంతో, ఫిబ్రవరికి మరిన్ని ఇళ్లు పూర్తవుతాయని భావిస్తున్నారు. ఇది ఈ పథకం అమలును మరింత వేగవంతం చేస్తుంది. ఈ పథకం కింద మొత్తం ఖర్చు రూ.20,638.16 కోట్లకు చేరుకుంది.

## భవన కార్మికులకు పథకాలు అమలు చేయాలి

**కాకినాడ, పతాకం న్యూస్:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిలుపుదల చేసిన 2019 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చీఫ్ సెక్రెటరీకి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ డిసిఎల్ ద్వారా వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్ల శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కల రాజ్ కుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తేదీ చెప్పకుండా భవన నిర్మాణ కార్మికులను మభ్య పెట్టేందుకే కూటమి ప్రభుత్వం ఉత్తుత్తి ప్రకటనలు చేస్తోందని విమర్శించారు. నిలుపుదల చేసిన 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లెయిముల పరిహారాలను కార్మికులకు చెల్లించాలని, గత ఆరేళ్లలో అర్హులై ఉండి పథకాలు పొందని భవన నిర్మాణ కార్మికులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, 50 ఏళ్లు దాటిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికీ సంక్షేమ బోర్డు నిధుల నుంచి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## విమానాశ్రయానికి ప్రతిపాదిత భూములపై సమీక్ష



**మాచర్ల, పతాకం న్యూస్:** మండల పరిధిలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రతతిపాదించిన భూముల అంశంపై తహశీల్దారు కార్యాలయంలో సమీక్షించారు. ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన బృంద సభ్యులు అనిందితా రారు (సోషల్ టీమ్), ఆయుషి రారు (జీటీ టీమ్ ఉ అసిస్టెంట్ మేనేజర్), ప్రోజిత్ ముఖర్జీ (జీటీ టీమ్ ఉ కన్సల్టెంట్), పరమిత రారు (సోషల్ టీమ్), సుమర్ సర్కార్ (సామాజిక నిపుణుడు) తదితరులతో తహశీల్దార్ కిరణ్‌కుమార్, వీఆర్వోలు సమావేశమయ్యారు. మాచర్ల మండలంలోని పశువేముల, చింతలతండా, నాగులవరం, విజయపురి సౌత్ తదితర గ్రామాల్లో విమానాశ్రయానికి ప్రతిపాదించిన సుమారు 800 యకరముల భూమి గురించి చర్చించారు. ప్రతిపాదిత భూముల వర్గీకరణ, ప్రైవేటు భూములు, అసైన్‌మెంట్ భూములు, రహదారులు, ఎన్‌ఎస్‌పీ కాలువలకు సంబంధించిన భూముల రేట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సంబంధిత రెవెన్యూ రికార్డులు, ఎఫ్.ఎం.బీలు పరిశీలించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు కిరణ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో మండల సర్వేయర్ సిహెచ్.శ్రీనివాసరావు, పశువేముల విఆర్ఓ కేతావత్ చిరంజీవి నాయక్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## మూడో రోజు సహకార ఉద్యోగుల సమ్మె

**జగ్గంపేట, పతాకం న్యూస్:** సహకార సంఘ ఉద్యోగులు జగ్గంపేటలోని కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు వద్ద మూడో రోజు నిరసన దీక్ష చేపట్టారు. గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట బ్యాంక్ పరిధిలోని రాజపూడి, జగ్గంపేట, పి.నాయకంపల్లి, జెడ్. రాగంపేట ఉద్యోగులు పాల్గొన్నారు.పిఠాపురం సహకార ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఎపి రైతుసంఘం మద్దతు తెలిపింది. పట్టణంలోని స్థానిక డిసిసిబి బ్యాంక్ వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించిన రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి, సహకార ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.ఆదినారాయణరావు, ఎస్.నరసరాజు మాట్లాడారు. జిఒ నెం.36ను వెంటనే అమలు చేయాలన్నారు. 2019, 2024 పెండింగ్‌లోని వేతన సవరణలు చేయాలని అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ రెడ్డి, సిఇఒలు కెవి.రాఘవ, ఎం.వీరభద్రరావు, ఎన్.ఉమామహేశ్వరరావు, జి.కామేశ్వరరావు, వైవిఎస్ఎస్.మూర్తి, ఎ.రామ్మోహన్ రావు, కె.రాజు పాల్గొన్నారు.

## సామాజిక రక్షణ చట్టం చేయాలి



**తాడేపల్లి, పతాకం న్యూస్:** రజక వృత్తిదార్లకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లి పట్టణంలోని ఒకటో వార్డు అంబేద్కర్ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా భాస్కరయ్య మాట్లాడుతూ రజక కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, ప్రతి రజక కుటుంబానికి రూ.3 లక్షలు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లాండ్రీ వృత్తిదారులకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలన్నారు. రజక వృత్తిని సామాజిక సేవ వృత్తిగా గుర్తించాలని, 50 ఏళ్లు నిండిన వృత్తిదార్లకు పింఛన్లు ఇవ్వాలని, కోరారు. జీవో 27 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టు రజక యువతి యువకులకు ఇచ్చి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రజక యువతి యువకులకు వృత్తిలో వస్తున్న అధునాతనమైన యంత్రాల వినియోగంపై స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి అందులో శిక్షణ ఇవ్వాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గుణశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువులపై రజకులకు అధికారం అప్పజెప్పాలని కోరారు. రజకులపై నేటికీ గ్రామాల్లో దాడులు దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రజకులకు అన్నీ చేస్తామని హామీ ఇచ్చి, నేడు విస్మరించారని విమర్శించారు. వృత్తి రక్షణ కోసం నెలకు సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇంతవరకు ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతవరకు ఒక్క పింఛను కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేయకుండా వివిధ రకాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. బట్టలు తెల్లగా ఉతకటమే కాదు, హామీలు అమలు జరపని వారిని కూడా ఉతికి ఆరేస్తామని హెచ్చరించారు. అనంతరం చలో అసెంబ్లీకి తరలివెళ్తుండగా పోలీసులు అడ్డుకుని పలువుర్ని అరెస్టులకు పూనుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ వెంకట్ రెడ్డయ్య, ఆర్.అంకయ్య, ఎల్.నిర్మలమ్మ, పి.శ్రీనివాసులు, సి.శేషాద్రి, ఎన్.శ్రీనివాసులు, సి.రాజేష్, ఎం.వెంకట నరసయ్య, సీతయ్య, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వృతిదార్లు పాల్గొన్నారు.

# కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే..!



మీ కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ ఈ ఆహారాలను తీసుకోవాల్సిందే..! మన శరీరం సక్రమంగా పనిచేయడానికి సహాయపడే అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు కూడా ఒకటి. ఇవి మన శరీరంలో అతి ముఖ్యమైన విధులను నిర్వర్తిస్తాయి. వ్యర్థాలను బయటకు పంపించడం, రక్తపోటును అదుపులో ఉంచడం, శరీరంలో ద్రవాలను సమతుల్యంగా ఉంచడం, శరీర జీవక్రియలకు మద్దతు ఇవ్వడం వంటి అనేక విధులను మూత్రపిండాలు నిర్వర్తిస్తాయి.

మన శరీరం సక్రమంగా పనిచేయడానికి సహాయపడే అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు కూడా ఒకటి. ఇవి మన శరీరంలో అతి ముఖ్యమైన విధులను నిర్వర్తిస్తాయి. వ్యర్థాలను బయటకు పంపించడం, రక్తపోటును అదుపులో ఉంచడం, శరీరంలో ద్రవాలను సమతుల్యంగా ఉంచడం, శరీర జీవక్రియలకు మద్దతు ఇవ్వడం వంటి అనేక విధులను మూత్రపిండాలు నిర్వర్తిస్తాయి. అయితే ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. జంక్ ఫుడ్ ను, ప్రాసెస్ చేసిన ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతోంది. దీంతో మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటోంది. వాటి పనితీరు కూడా తగ్గుతోంది. మూత్రపిండాల ఆరోగ్యంపై మొత్తం శరీరం ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కనుక మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

మనకు చాలా తక్కువ ధరలో ఏడాది పొడవునా లభించే కూరగాయల్లో కీరదోసకాయ ఒకటి. వీటిలో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో సహయపడతాయి. కీరదోసకాయలను తీసుకోవడం వల్ల శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. కీరదోసకాయలలో పొటాషియం తక్కువగా ఉంటుంది కనుక మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడే వారు కూడా వీటిని తీసుకోవచ్చు. నిమ్మకాయలు కూడా మూత్రపిండాల ఆరోగ్యానికి మద్దతును ఇస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లో రాళ్ల సమస్య నుండి కూడా బయటపడవచ్చు. నిమ్మకాయల్లో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్ల ఏర్పడకుండా చేయడంలో దోహదపడుతుంది. రోజూ గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యంతోపాటు వాటి పనితీరు కూడా మెరుగుపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మూత్రపిండాల కణాలు దెబ్బతినకుండా రక్షిస్తాయి.ఆరోగ్య సలహా సేవలు

అలాగే కొత్తిమీరను తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మూత్రం ఉత్పత్తిని పెంచుతుంది. శరీరంలో ఉండే అదనపు ద్రవాలు, వ్యర్థాలు, విషాలు మూత్రం ద్వారా బయటకు పంపించడంలో కొత్తిమీర ఎంతో సహాయపడుతుంది. దీంతో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా ఉంటాయి. కొత్తిమీరలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వాపులను తగ్గించడంతో పాటు కణజాల నష్టం జరగకుండా కాపాడడంలో కూడా సహాయపడతాయి. దీనిలో నైట్రేట్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో ఉపయోగపడతాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అలాగే మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడే వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ ఆహారాలను తీసుకుంటూనే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం, రక్తపోటును అదుపులో ఉంచుకోవడం, నీటిని తాగడం, ధూమపానాన్ని మానేయడం వంటివి చేయడం వల్ల మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు కూడా రాకుండా ఉంటాయని వైద్యులు సలహా ఇస్తున్నారు.పోషకాహార ప్రణాళికలు

# శరవేగంగా ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు

## బడ్జెట్‌లో రూ.90.6 కోట్లు కేటాయింపు



**మెళియాపుట్టి, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆఫ్‌షోర్‌కు సుమారు రూ.90.6 కోట్లు కేటాయించింది. దీంతో ప్రస్తుతం పనులు పరుగులు పెడుతున్నాయి. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక దృష్టిసారించి అధికారులు, రైతులతో చర్చలు జరిపి పనులకు ఆటంకం కలగకుండా చూస్తున్నారు. జలాశయ పనులతో పాటు పెద్దమడి నుంచి టెక్కలిపట్నం వరకు రహదారి నిర్మాణం, కల్వర్టు పనులు జోరుగా సాగుతున్నాయి. కుడి, ఎడమ కాలువల పనులు సైతం ఊపందుకున్నాయి. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పలాస మండలం రేగులపాడు వద్ద రూ.127కోట్ల వ్యయంతో రిజర్వాయర్ పనులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే, ఏళ్ల తరబడి ఈ పనులపై దృష్టి సారించలేదు. అప్పట్లో నిర్వాసితులు, భూములు కోల్పోయిన రైతులకు ఎటువంటి పరిహారం కూడా ప్రకటించలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పనుల్లో కదలిక వచ్చింది. 2016లో మొదటి విడత రూ.466 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధుల్లో భూసేకరణ, ఆర్అండ్ఆర్ కోసం రూ.214 కోట్లు ఖర్చు చేసింది. నిర్వాసిత గ్రామాలు శారదపురం, చిన్నగురువూరు, చీపురుపల్లి, దాసుపురం, రేగులపాడుకు చెందిన 1,154 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి పునరావాసం కల్పించింది. ఒక్కొక్క కుటుంబానికి రూ.11.50లక్షల నిర్మాణ వ్యయం అందజేసింది. మరోవైపు రూ.84.06 కోట్లతో రిజర్వాయర్ పనులు చేపట్టింది. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే పనులు జరుగుతున్నాయి. గత బడ్జెట్‌లో 299.67 కోట్లు కేటాయించింది. మహేంద్రతనయ నదిపై చాపర వద్ద వరద కాలువ నిర్మాణం చేపట్టనున్నారు. 108 గ్రామాల్లో 24,600 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. చాపర నుంచి చీపురుపల్లి వరకు సుమారు 13.56 కిలోమీటర్ల పొడవునా హెడ్‌ఫ్లో కెనాల్‌ను నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు 7.9 కిలోమీటర్ల పొడవునా పనులు జరిగాయి. మిగతా పనులు ప్రస్తుతం ప్రారంభించారు. 1.08 టీఎంసీల రిజర్వాయర్ నిర్మాణానికి 1,536 ఎకరాల భూమిని వినియోగిస్తున్నారు. దీనికి 2.5 కిలోమీటర్ల పొడవునా ట్యాంక్ బండ్ నిర్మిస్తున్నార. దీనిఎత్తు 55.5 మీటర్లు. 500 మీటర్లు బెడ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీటిని అందించేందుకు 11.5 కిలోమీటర్లతో పాటు ఆర్ఎంసీ 12 కిలో మీటర్ల పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు రూ.345.79 కోట్లు ఖర్చుచేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. 50 ఎకరాల భూసేకరణకు సంబంధించి రైతులకు రూ.7.04 కోట్ల పరిహారం పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు.

# ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం

## అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలకు సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన విస్తృత టారిఫ్‌లను (దిగుమతి సుంకాలు) అమెరికా సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. 1977 నాటి అత్యవసర చట్టాన్ని అడ్డం పెట్టుకుని ఏకపక్షంగా టారిఫ్‌లు విధించే అధికారం అధ్యక్షుడికి లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు 6-3 మెజారిటీతో సంచలన తీర్పు వెలువరించింది. ట్రంప్ కార్యనిర్వాహక అధికారాలకు కన్జర్వేటివ్ మెజారిటీ ఉన్న కోర్టు కళ్లెం వేయడం అరుదైన ఘటనగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఈ తీర్పుపై మెజారిటీ తరఫున అభిప్రాయాన్ని రాసిన ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్, అధ్యక్షుడి అధికారాల పరిధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. “అపరిమితమైన మొత్తంలో, కాలపరిమితి లేకుండా, విస్తృత స్థాయిలో ఏకపక్షంగా టారిఫ్‌లు విధించే అసాధారణ అధికారాన్ని అధ్యక్షుడు కోరుతున్నారు. రాజ్యాంగబద్ధంగా చూసినప్పుడు, అటువంటి అధికారాన్ని వినియోగించుకోవాలంటే కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్) నుంచి స్పష్టమైన అనుమతి ఉండాలి. కానీ, ట్రంప్ ఆధారపడిన 1977 చట్టానికి ఆ స్థాయి అధికారం లేదు” అని రాబర్ట్స్ తన తీర్పులో పేర్కొన్నారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద అధ్యక్షుడికి అసాధారణ పరిస్థితుల్లో దిగుమతులను నియంత్రించే అధికారం మాత్రమే ఉందని, టారిఫ్‌లు విధించే అధికారం లేదని కోర్టు తేల్చి చెప్పింది. “ఆర్థిక లేదా విదేశీ వ్యవహారాల్లో మాకు ప్రత్యేక నైపుణ్యం ఉందని చెప్పడం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం మాకు కేటాయించిన పరిమిత పాత్రను మాత్రమే పోషిస్తున్నాం. ఆ పాత్రను నిర్వర్తిస్తూ, ఐఈఈపీఏ చట్టం అధ్యక్షుడికి టారిఫ్‌లు విధించే అధికారాన్ని ఇవ్వలేదని మేము స్పష్టం చేస్తున్నాం,” అని జస్టిస్ రాబర్ట్స్ వివరించారు. ఫెంటానిల్, వాణిజ్య లోటు వంటి అంశాలను జాతీయ అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన ట్రంప్, ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని చైనా, మెక్సికో, కెనడా వంటి దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించారు. ప్రపంచవ్యాప్తంగా డజన్ల కొద్దీ దేశాలపై ప్రతీకార టారిఫ్‌లు అమలు చేశారు. 1-




# అభిషేక్ శర్మకు అండగా నిలుస్తాం: సూర్యకుమార్



టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా దక్షిణాఫ్రికాతో కీలకమైన సూపర్ 8 మ్యాచ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో, పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పూర్తి మద్దతు ప్రకటించాడు. అభిషేక్ ఫామ్ గురించి జట్టు యాజమాన్యం ఏమాత్రం ఆందోళన చెందడం లేదని, త్వరలోనే అతను ఫామ్‌లోకి వస్తాడని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం జరగనున్న మ్యాచ్‌కు ముందు విలేకరులతో మాట్లాడిన సూర్యకుమార్.. “అభిషేక్ ఫామ్ గురించి ఎవరైతే ఆందోళన చెందుతున్నారో, వాళ్లను చూస్తేనే నాకు ఆందోళనగా ఉంది. అతను ఇంకా పరుగులు చేయలేదంటే, తర్వాతి మ్యాచ్‌లలో ప్రత్యర్థి జట్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి” అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. “ఇది టీమ్ గేమ్. ఏడాది కాలంగా మా అందరి బాధ్యత తను తీసుకున్నాడు, ఇప్పుడు మేము తన కోసం నిలబడతాం. ఒకవేళ అతను విఫలమైతే, ఆ లోటును భర్తీ చేయడానికి మేమున్నాం” అని స్పష్టం చేశాడు. ఈ టోర్నమెంట్‌లో అభిషేక్ శర్మ ఇప్పటివరకు ఖాతా తెరవలేదు. అమెరికాపై గోల్డెన్ డక్‌గా వెనుదిరగ్గా, పాకిస్థాన్, నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లలోనూ తొలి రెండు ఓవర్లలోపే వికెట్ కోల్పోయాడు.

అంతకుముందు, భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా అభిషేక్‌కు అండగా నిలిచాడు. “అతను ప్రపంచ స్థాయి ఆటగాడు. జట్టులో అతని స్థానంపై ఎలాంటి చర్చ జరగడం లేదు. నెట్స్‌లో బంతిని చక్కగా ఆడుతున్నాడు. త్వరలోనే అతను జట్టుకు అవసరమైన పరుగులు చేస్తాడు” అని మోర్కెల్ తెలిపాడు. 2024 ప్రపంచకప్ రన్నరప్ అయిన దక్షిణాఫ్రికాపై అభిషేక్‌కు మంచి రికార్డు ఉంది. ఆ జట్టుతో 8 మ్యాచ్‌లు ఆడి ఒక హాఫ్ సెంచరీతో సహా 200 పరుగులు చేశాడు.

# కీలక దశకు చేరుకున్న టీ20 వరల్డ్‌కప్



సంచలన ఫలితాలతో ఆసక్తికరంగా సాగుతున్న టీ20 వరల్డ్‌కప్ ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. 20 జట్లతో ఆరంభమైన ఈ మెగా టోర్నీలో ప్రస్తుతం 8 జట్లు మిగిలాయి. వీటి మధ్య శనివారం నుంచి మార్చి 1 వరకు సూపర్-8 పోరు సాగనుంది. గ్రూప్ ‘ఏ’ నుంచి భారత్, పాకిస్థాన్.. గ్రూప్ ‘బి’ నుంచి జింబాబ్వే, శ్రీలంక.. గ్రూప్ ‘సి’ నుంచి వెస్టిండీస్, ఇంగ్లండ్.. గ్రూప్ ‘డి’ నుంచి దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఈ దశకు చేరుకున్నాయి. ఇక సెమీఫైనల్స్‌లో చోటే లక్ష్యంగా ఈ జట్లన్నీ అమీతుమీ తేల్చుకోనున్నాయి. మాజీ విజేత ఆస్ట్రేలియాతో పాటు అఫ్ఘానిస్థాన్ గ్రూప్ దశ నుంచే నిష్క్రమించిన సంగతి తెలిసిందే. అయితే తాజా ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విడదీశారు. గ్రూప్-1లో భారత్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్.. గ్రూప్-2లో న్యూజిలాండ్, ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్థాన్ ఉన్నాయి. ఇందులో ప్రతీ జట్టు మూడు మ్యాచ్‌లు ఆడనుంది. రెండింట్లో నుంచి టాప్-2గా నిలిచిన జట్లు సెమీస్‌కు వెళతాయి. పాయింట్లు సమంగా ఉంటే నెట్ రన్‌రేట్ కూడా కీలకమవుతుంది కాబట్టి ప్రతీ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

వాస్తవానికి గ్రూప్-1 పరిశీలిస్తే భారత్‌కు పెద్దగా పోటీ లేదేమోననిపిస్తుంటుంది. కానీ ఈ మెగా టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా సూపర్-8కు వచ్చిన జట్లన్నీ ఇదే గ్రూప్‌లో ఉన్నాయనే విషయం మరువరాదు. అంచనాలకు మించిన ఆటతీరుతో ఈసారి వెస్టిండీస్, జింబాబ్వే చెలరేగుతున్నాయి. ముఖ్యంగా ఆసీస్, శ్రీలంకలను జింబాబ్వే మట్టికరిపించింది.

ఎలాంటి తడబాటు లేకుండా దూకుడుగా సాగుతున్న ఈ జట్లను తక్కువ అంచనా వేస్తే కష్టమే. ముందుగా భారత జట్టు ఆదివారం సఫారీలతో ఆడనుంది. దీంతో 2024 టోర్నీ ఫైనల్ మ్యాచ్ రిపీట్ కానుంది. మరోవైపు గ్రూప్-2లో అన్నీ పటిష్ట జట్లే కావడంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగడం ఖాయం. ముఖ్యంగా పాక్‌పై తీవ్ర ఒత్తిడే నెలకొంది. అన్నీ సవ్యంగా కుదిరితే మరోసారి దాయాది జట్ల మధ్య సమరానికి కూడా ఆస్కారం లేకపోలేదు.




# శరవేగంగా అల్లు అర్జున్ సినిమా షూటింగ్



'పుష్ప' సినిమాతో వరల్డ్ వైడ్‌గా ఫేమ్ తెచ్చుకున్న ప్రముఖ హీరో అల్లు అర్జున్ తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌తో బిజిగా ఉన్నారు. డైరెక్టర్ అట్లీతో అల్లు అర్జున్ తర్వాతి చిత్రం(ఏఏ22) తెరకెక్కుతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కొనసాగుతోంది. దీనికి సంబంధించిన అప్‌డేట్ కోసం అల్లు ఫ్యాన్స్ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సినిమాలోని కామెడీ పార్ట్‌కు సంబంధించి ఆసక్తికరమైన రూమర్ ఒకటి సినీ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. మరి ఆ రూమర్ ఏంటి? అది ఎంతవరకు నిజమనేది చూద్దాం. ఈ సినిమాను దర్శకుడు భారీ స్థాయి లో తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. హాలివుడ్ స్టూడియోస్ ద్వారా అత్యధిక విజువల్ ఎఫేక్ట్స్‌తో సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌గా ఈ మూవీ రూపొందుతుంది. ఈ క్రమంలోనే సినిమాలోని కామెడీ జానర్ ఉండనుందని వాటిని రూపొందించటానికి దర్శకుడు పెద్ద ప్లాన్ వేసినట్టు వార్తాలు వస్తున్నాయి. అవేంటంటే అనిల్ రావిపూడి, శ్రీను వైట్లతో ఈ చిత్రంలో కామెడీ ట్రాక్స్‌ను క్రియేట్ చేయానున్నట్లు టాక్ నడుస్తోంది. ఆ కామెడీ సీన్స్ కోసం స్టార్? హీరో ప్రత్యేకంగా వీరిద్దరినే ఎంచుకున్నట్టు రూమర్స్? వస్తున్నాయి. కానీ వీటిలో ఏ మాత్రం నిజం లేదని తెలుస్తోంది. ఎందుకంటే ఆ డైరెక్టర్లు వారి నెక్ట్స్ ప్రాజెక్ట్సులతో బిజిగా ఉన్నారని సమాచారం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ రూమర్ నిజం కాదని సినీ వర్గాలు కొట్టి పారేశాయి. ఈ సినిమాలో స్పెషల్ కామెడీ ట్రాక్‌కు సంబంధించి అట్లీ ఎలాంటి ప్లాన్ చేయటం లేదని రివీల్ చేశారు. ఈ సైన్స్ ఫాంటసీ సినిమా కోసం ప్రత్యేక కామెడీ క్యారెక్టర్లు క్రియేట్ చేయనున్నరని తెలుస్తోంది. అనిల్ రావిపూడి, వైట్ల కామెడీ సీన్స్ ఈ సినిమాకు ఏమాత్రం ఫిట్ కావని అన్నారు. అయితే ఈ సినిమా పాన్ ఇండియా కాదు అంతకు మించి ఉంటుందని దర్శకుడు అట్లీ అనటంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

బన్నీ- అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా భారతీయ సినిమాల్లోనే ప్రతిష్మాత్మక ప్రాజెక్ట్‌లో ఒకటి. ఇందులో అల్లు అర్జున్ పాత్ర యానిమేటెడ్ వెర్షన్‌లో డిఫరెంట్ పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ సినిమాను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా సాయి అభ్యంకర్ పనిచేస్తున్నారు. ఈ సినిమాలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీపికాతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వి కపూర్, రష్మిక మందన్నా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా రష్మిక విలన్ రోల్‌లో కనిపిస్తున్నట్లుగా టాక్.

# హెబ్బా పటేల్ కొత్త చిత్రం 'మిరాకిల్'



సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిరాకిల్'. ప్రభాస్ నిమ్మల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హెబ్బా పటేల్ నటిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూళ్లు పూర్తి చేసుకున్న ఈ సినిమా మూడో షెడ్యూల్‌ను ఈ నెల 24 (ఫిబ్రవరి 24) నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నాయుడు పెంద్ర ఈ సినిమాతో విలన్‌గా పరిచయం అవుతున్నారు.




# 27నే థియేటర్లలోకి 'విష్ణు విన్యాసం'



యంగ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా 'విష్ణు విన్యాసం' విడుదల తేదీ మారింది. ముందుగా ప్రకటించిన దానికంటే ఒక రోజు ముందే ఈ ఫన్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఫిబ్రవరి 28న విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని, ఇప్పుడు ఫిబ్రవరి 27, శుక్రవారం నాడు రిలీజ్ చేయనున్నారు. నిజానికి ఫిబ్రవరి 27న శ్రీవిష్ణు నటించిన మరో సినిమా 'మృత్యుంజయ' విడుదల కావాల్సి ఉంది. అయితే, ఆ క్రైమ్ థ్రిల్లర్ వాయిదా పడటంతో ఆ తేదీ ఖాళీ అయింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ, బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ రాబట్టేందుకు 'విష్ణు విన్యాసం' చిత్రాన్ని ఒకరోజు ముందుకు జరిపారు. ఈ విషయాన్ని హీరో శ్రీవిష్ణు తన సోషల్ మీడియాలో సరదాగా ప్రకటించారు. "జాతకం ప్రకారం... ఈ 27 నుంచి థియేటర్లలో నవ్వుల వర్షం కురుస్తుంది. మీ జాతకంలో మొదలవుతుంది" అంటూ ఫన్నీ పోస్ట్ పెట్టారు. యదునాథ్ మారుతి రావు దర్శకత్వం వహిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో శ్రీవిష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. మూఢనమ్మకాలు, జాతకాలను ఎక్కువగా నమ్మే యువకుడిగా శ్రీవిష్ణు పాత్ర ఆసక్తికరంగా ఉండనుంది. ఈ చిత్రంలో సత్య, మురళీ శర్మ, బ్రహ్మాజీ ముఖ్య పాత్రలు పోషిస్తుండగా, రాధన్ సంగీతం అందిస్తున్నారు. ఫిబ్రవరి 25న యూఎస్‌లో ప్రీమియర్ షోలు కూడా ప్రదర్శించనున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**